క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం గ్రామస్తులకు యోగాపై పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురువు భాగ్యనగర్ దక్షిణ జిల్లా సీనియర్ యోగ ప్రచారకుడు సత్తయ్య పాల్గొని ప్రజలకు యోగాసనాలు వేయించారు. యోగ చేయడంతో బీపీ, షుగర్ వ్యాధులను తగ్గించుకోవచ్చని ఆయన సూచించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగ సాధన చేసి ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, యాదయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి సన్మానం


మాజీ ఎంపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. షాద్‌నగర్‌కు విచ్చేసిన మాజీ ఎంపీ పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్‌ను ఆయన పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, ఈశ్వర్ రాజు, ఇబ్రహీం, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి అభిషేకం


ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: మండల పరిధిలోని కమ్మెటలో ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంగయ్య, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, వెంకటయ్య, భిక్షపతి, అంజయ్య, బాలకృష్ణ, వెంకటేశ్, పెంటయ్య, నర్సింలు, రామకృష్ణ, ఆంజనేయులు, రాములు, సత్యనారాయణ, జంగయ్య, కుమార్, పాండు, మణికాంత్, మనోహర్, రామచంద్రయ్య తదితరులు ఆపల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

చేవెళ్ల: మండల పరిధిలోని పామెన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. దేవుని ఎర్రవల్లికి చెందిన సామ రంగారెడ్డి 50 బస్తాల సిమెంటు, పామెనకు చెందిన దావల్‌గారి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి 100 బస్తాల సిమెంటు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, ఎర్ర గోపాల్, కొయ్యాడ రాములు, కంకంటి యాదయ్య, సత్యశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: వారంతా ఇరవై ఐదు ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు. అందరూ మళ్లీ ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మండల పరిధిలోచి చన్వెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరూ యోగక్షేమాలను తెలుసుకుని జీవన స్థితిగతులను పంచుకున్నారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాంప్రసాద్, విజయ్ కుమార్, బల్వంత్‌రెడ్డి, అనంతం, బుచ్చిరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, విద్యార్థులు భూపాల్, యాదయ్య, నర్సింలు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, రవికుమార్, మల్లికార్జున్, తిరుపతిరెడ్డి, సరిత, రాధిక, వనిత, మమత, పద్మ, అరుంధ, అరుణ పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు

- గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షణ
- బస్‌షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


అమ్డాపూర్ చౌరస్తాలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులకు నిత్యం ఎండ, వానలో ఇబ్బందులు తప్పడం లేదు. బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షించాల్సి పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపులు, హోటళ్లు, కిరాణషాపుల ఎదుట నిల్చొని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. అధికారులు బస్‌షెల్టర్లు నిర్మించి తమ ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు లేక పాట్లు

మండలంలోని హైదరాబాద్–బీజాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న పోలీస్ అకాడమీ అప్పా మొదలుకొని టోల్‌కట్ట బస్టాప్ వరకు ఆయా గ్రామాల చౌరస్తాలలో బస్టాప్‌లు ఉన్నా బస్‌షెల్టర్లు లేవు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, ఆయా విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు గంటల తరబడి వేచి ఉంటూ ఇబ్బందులకు గురవుతున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, అమ్డాపూర్ చౌరస్తా, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట ఆయా గ్రామాల చౌరస్తాలలోని బస్టాప్‌లలో బస్‌షెల్టర్లు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు రోడ్లపై నిల్చొని బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. మండల పరిధిలో అనేక ఇంజినీరింగ్ కళాశాలలు, పలు మెడికల్, డెంటల్ కళాశాలలతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. జంట నగరాల నుంచి విద్య కోసం ఈ ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటారు. బస్టాప్‌లలో కనీస బస్ షెల్టర్లు లేకపోవడం శోచనీయమని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ద్వారా సంబంధిత అధికారులు, ప్రైవేటు సంస్థలు స్వచ్ఛందంగా పరిశీలించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


అజీజ్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై బస్టాప్‌లో నిల్చున్న విద్యార్థులు

బస్‌షెల్టర్లు నిర్మించాలి



మండల కేంద్రంలో ఉన్న ఆయా గ్రామాల చౌరస్తాలలో బస్టాప్‌ల వద్ద బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, ఎండా, వానలో ప్రయాణికులు రోడ్లపై వేచి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణికులు నీడలేక అల్లాడుతున్నారు. బస్ షెల్టర్లు లేకపోవడంతో రోడ్లపైనే నిల్చొని బస్సుల కోసం ఎదురుచాస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బాకారం

రోడ్లపైనే నిరీక్షణ



మండల కేంద్రంలోని బస్టాప్‌లలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే నిల్చుంటున్నారు. ఎండనకా వాననకా కూర్చుందామన్న కనీసం నీడ కూడా లేని పరిస్థితి. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, అమ్డాపూర్ గ్రామాలతో పాటు మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట బస్టాప్‌లలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు రోడ్లపై నిల్చొని గంటల తరబడి నిరీక్షిస్తూ బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం బస్టాప్‌లు ఉన్న వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– అద్వానీ, అజీజ్‌నగర్ గ్రామస్తుడు

అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్


మాట్లాడుతున్న శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల పక్షాన ఈ నెల 27న నిర్వహించిన మహాగర్జన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులపై పోలీసులు అక్రమ కేసులను నమోదు చేశారన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని అడిగిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులపై, విద్యార్థి సంఘం నాయకులపై అక్రమ కేసులు పెడితే తగిన గుణపాఠం చెప్పామన్నారు. విద్యార్థి నాయకులపై కేసులుపెట్టి ఉద్యమాలను ఆపాలని చూస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే మీకు పడుతుందన్నారు. విద్యార్థి సంఘం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేని యెడల ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు సుమేర్, కార్యదర్శి శివ, నాయకులు వినయ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు విరాళం


దాత తాండ్ర కాశీనాథ్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో గల అంబభవానీ మాత దేవాలయంలో ప్రతీ యేడు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి గ్రామపెద్దలకు రూ.1లక్ష ఆర్థికసాయం అందజేశారు. అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కాశీనాథ్‌రెడ్డి సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. తాండ్ర కాశీనాథ్‌రెడ్డికి గ్రామ పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్సవాలకు రావాలని కోరుతూ తాండ్ర కాశీనాథ్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో అంబ భవానిమాత దేవాలయ కమిటీ చైర్మన్ ముత్యాలరాజు, ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ నారందినేశ్‌రెడ్డి, నాయకులు జితేందర్‌రెడ్డి, ఆర్ల యాదయ్యయాదవ్, గున్న కృష్ణయ్యయాదవ్, కావలి శ్రీశైలం, రాజు, నారం శ్రీపాదరెడ్డి, ఎంకనోళ్ల శివ, మేడిపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


కొత్తూరు: పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

పార్టీ రాష్ట్ర నాయకుడు బాబాయ్య

కొత్తూరు: బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అందె బాబాయ్య అన్నారు. మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి సభ్యత్వాలను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. దేశంలో ఉన్న ఆయా పార్టీల్లో మాదిరిగా బీజేపీలో కుటుంబ పాలన, ఆధిపత్యం ఉండవన్నారు. పార్టీ అభివృద్ధి, సిద్ధాంతాల కోసం కష్టపడే వారికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అమడపురం నర్సింహగౌడ్, మాణిక్యం, రమేశ్, శ్రీనివాస్, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం


శంకర్‌పల్లి: పార్టీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రధాని మోదీ నేతృత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సురేశ్ అన్నారు. ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 12, 14 వార్డుల్లో పర్యటించి, పలువురికి సభ్యత్వం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చి అమలు చేయలేకపోతున్న హామీలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా ఉండి గెలుపొందాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జైరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీటీ యూనియన్ మండల అధ్యక్షుడి రాజీనామా

మొయినాబాద్‌రూరల్: తోటి ఉపాధ్యాయులతో ఎల్లప్పుడూ కలుసుకోలేకపోతున్న కారణంగా ఉపాధ్యాయ సంఘం ఎస్టీటీ యూనియన్ మండల అధ్యక్షుడిగా రాజీనామా చేస్తున్నట్లు పి.రాంచంద్రయ్య తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎస్టీటీ కార్యవర్గ సమావేశంలో తనను మండల అధ్యక్షుడిగా నియమించిన ఉపాధ్యాయులందరికీ నాకు కొన్ని ఇబ్బందులతో న్యాయం చేయలేకపోతున్నానేమో అని మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, నామమాత్రంగా పదవులు తీసుకొని న్యాయం చేయలేకపోతే వృథా అని అందుకే అధ్యక్ష పదవికి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సూచించారు. తోటి ఉపాధ్యాయులు ఎలాంటి విభేదాలు పెట్టుకోవద్దన్నారు.

అతి పెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఏబీవీపీ

శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్


నూతన అధ్యక్షుడు యాదయ్యకు నియామకపత్రం అందజేస్తున్న సూర్యప్రకాశ్

షాబాద్: దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఏబీవీపీ అని శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏబీవీపీ నగర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ సంస్థలో పనిచేసేందుకు ముందుకురావాలన్నారు. సమాజ హితం, దేశ హితం కోసం పనిచేసే సంస్థలో ఎవరికైనా ఒకే స్థానం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సమాజం కోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బర్ల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

షాబాద్ ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు సూర్యప్రకాశ్ తెలిపారు. షాబాద్ నగర అధ్యక్షుడిగా యాదయ్య, నగర కార్యదర్శులుగా మధు, కిరణ్, నగర ఉపాధ్యక్షులుగా ప్రేమ్‌విజయ్, నందు, భవదీప్, నగర సంయుక్త కార్యదర్శులుగా ప్రవీణ్, బాల్‌రాజ్, నిఖీల్, వరుణ్, ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్లుగా రాజేశ్, సంగమేశ్వర్, ఎస్‌ఎఫ్‌ఎస్‌లుగా ఆనంద్, మల్లేశ్, కన్వీనర్లుగా ప్రణయ్, లోకేశ్, లక్ష్మినర్సింహ, మీడియా కన్వీనర్‌గా మోహన్ తదితరులను ఎన్నుకున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు


ఐఓసీఎల్ పెట్రోల్‌బంక్ సమీపంలో రోడ్డు పక్కన వరుసగా నిలిపిన లారీలు(ఫైల్)

కొత్తూరు: అసలే ఆ జాతీయ రహదారిపై గంటకు వందకు మించిన వేగంతో వాహనాలు దూసుకెళ్తుంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన క్షణాల్లో ప్రమాదాలు చోటు చేసుకోవడం.. వాహనదారులు మృత్యువాతపడడం జరుగుతోంది. మండల కేంద్రంలోని జాతీయ రహదారి, బైపాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఇప్పటివరకు చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఎక్కువగా రోడ్డు పక్కన నిలిపిన వాహనాలను అదే రూట్లో వెనకాల నుంచి వచ్చే వాహనాలు ఢీకొట్టినవే ఉన్నట్లు పోలీసు రికార్డులు తెలుపుతున్నాయి. రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా వాహనాలు నిలపకుండా పోలీసులు, హైవే పెట్రోలింగ్ అధికారులు వాహనదారులకు సూచిస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. కొత్తూరు మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు విస్తరించిన బైపాస్ రోడ్డుకు ఇరువైపులా హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో నిత్యం భారీ వాహనాలు, లారీలను నిలుపుతున్నారు. అత్యవసర పనుల నిమిత్తం వేగంగా వెళ్లే వాహనదారులు గమనించకుండా నిలిపి ఉన్న లారీలు, భారీ వాహనాలను వెనకాల నుంచి ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పక్కన వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఈ దిశగా కనీస చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాకుండా కనీసం రోడ్డు పక్కన వాహనాలు నిలపడం ప్రమాదకరం.. నిలిపితే చర్యలు తీసుకుంటామనే సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పక్కన వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాశీ అన్నపూర్ణ సత్రం ఉపాధ్యక్షుడిగా మలిపెద్ది శంకర్


చైర్మన్‌ను సన్మానిస్తున్న శంకర్, శ్రీనివాస్‌గుప్తా

షాద్‌నగర్: కాశీ అన్నపూర్ణ సత్రం కమిటీ ఉపాధ్యక్షుడిగా షాద్‌నగర్‌కు చెందిన మలిపెద్ది శంకర్ ఎన్నికయ్యారు. అదేవిధంగా సత్రం కార్యవర్గ సభ్యుడిగా మలిపెద్ది శ్రీనివాస్‌గుప్తా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్రం చైర్మన్ టీజీ వెంకటేశ్‌ను కలిసి వారు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఆహారపు అలవాట్లలో మార్పు అవసరం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్వర్ణలత

షాబాద్: ప్రతి ఒక్కరికీ తమ జీవనశైలితో పాటు ఆహారపు అలవాట్లలో మార్పు అవసరమని చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్వర్ణలత పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ రోజు నడక, వ్యాయామం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండె లయబద్ధంగా కొట్టుకోకపోవడంతో చిన్న వయస్సులో జనటిక్ సమస్యలతో బలహీన పడుతుందని చెప్పారు. హార్ట్‌బీట్, కొలెస్ట్రాల్, బీపీ. షుగర్ క్రమం తప్పకుండా చూసుకోవాలన్నారు. ఆహారపు అలవాట్లు, పొగతాగడం, మద్యపానం, ఉబకాయం ఇవన్నీ గుండె జబ్బులకు దారితీస్తాయని తెలిపారు. మనిషి శరీరంలో అతి ప్రధానమైంది గుండె ప్రస్తుత ఆధునిక జీవనంలో దీనికి భద్రత లేకుండా పోతోందన్నారు. శారీరక శ్రమ తగ్గడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, పొగతాగడం, ఒత్తిడితో గుండెపోటుకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లేశ్, నవీన్, ఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఇళ్ల మధ్య ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- తొలగించాలని స్థానికుల వినతి

మొయినాబాద్: ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇళ్ల మధ్యనే ఉంది. ఇనుప స్తంభాలతో ఏర్పాటు చేసిన ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచిఉంది. ఇళ్లకు అతి చేరువలో ఉండటంతో వర్షాకాలంలో విద్యుత్ షాక్ తగిలే అవకాశం ఉంది. పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళ్లే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల మధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరుతున్నారు.


ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సొంత ఖర్చులతో రోడ్డు పనులు


మొరం పోసి మరమ్మతులు చేయిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: గ్రామానికి వెళ్లే సింగిల్ రోడ్డుకిరువైపులా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతుండడంతో గ్రామస్తులే రోడ్డు బాగు చేసుకోవడానికి ముందుకొచ్చారు. మండల పరిధిలోని ఊరెళ్ల గ్రామస్తులు ఆదివారం రోడ్డు బాగుచేసుకునే పనులను మొదలుపెట్టారు. చేవెళ్ల నుంచి ఊరెళ్ల వీదుగా మాణికేశ్వరిమాత ఆలయం వరకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరం సింగిల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు రోడ్డు బాగు చేయించేందుకు నడుం బిగించారు. గ్రామ సమీపంలో ఉన్న వంశీరాం బిల్డర్స్‌కు సంబంధించిన భూమిలో మొరం తీసుకోవడానికి వారు అంగీకరించడంతో మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, గ్రామస్తులు మొరం తేవడానికి, చదును చేయడానికి ఖర్చులను భరిస్తూ రోడ్డు చదును చేయించారు.